సాక్షి నిర్మల్

ఆదివారం ◆ 4 ◆ జూన్ ◆ 2023



అనగనగా ఓ ఊరు..

10లో ▸

అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలింది ఇస్లాంపూర్. ఆ ఊరికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. చుట్టూ ఇబ్బందులు న్నా.. ఎవరినీ నిందించకుండా వన్యప్రాణులతో స్నేహం చేస్తూ.. అడవితల్లి ఒడిలో అలరాలుతున్నారు ఆదివాసీలు.

సురక్ష దినోత్సవానికి ఏర్పాట్లు

నిర్మల్ టౌన్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 'సురక్ష' దినోత్సవానికి జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొననున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.8 /28.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత అధికంగానే ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

సమీకృతం సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన నూతన సమీకృత భవనం

- నేడు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు రాక..
- కలెక్టరేట్, బీఆర్ఎస్ భవన్ ప్రారంభం..
- మరో ఏడు కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం
- 'క్రషర్‌గ్రౌండ్'లో బహిరంగసభ
- ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి, కలెక్టర్, ఎస్పీ
- గులాబీమయమైన జిల్లాకేంద్రం

నిర్మల్: ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి ఆదివారం జిల్లాకు వస్తున్నారు. 2018, నవంబర్ 22న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. ఖానాపూర్, నిర్మల్, భైంసా బహిరంగసభల్లో పాల్గొన్నారు. సీఎం హోదాలో జిల్లాకు అధికారిక పర్యటన కోసం రావడం ఇదే మొదటిసారి. జిల్లాకేంద్రంలో నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మరో ఏడు కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొంటారు. అధికారిక లెక్కల ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం జిల్లాకు వస్తారని సమాచారం. కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలకడంతోపాటు కలెక్టరేట్ ప్రారంభోత్సవం, అనంతరం నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వారం రోజులుగా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యటనకు సంబంధించిన పనులను నిరంతరం పరిశీలిస్తున్నారు. అధికారిక కార్యక్రమాలతోపాటు బహిరంగసభకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



కలెక్టర్ చాంబర్..

సీఎం పాల్గొనే కార్యక్రమాలివే..

హైదరాబాద్ నుంచి నేరుగా నిర్మల్ చేరుకున్న తర్వాత సీఎం కేసీఆర్ ముందుగా స్థానిక కొండాపూర్ బైపాస్ వద్ద నిర్మించిన బీఆర్ఎస్ భవన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం సమీకృత కలెక్టరేట్(ఐడీఓసీ) ప్రారంభంతోపాటే మిగతా పనులకు అక్కడి నుంచే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారు.

- ఎల్లపెల్లి శివారులో రూ.56 కోట్లతో రోడ్లు భవనాల శాఖ నిర్మించిన ఐడీఓసీ(ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్)ను ప్రారంభిస్తారు.
- జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీకి సంబంధించిన భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- సారంగపూర్ మండలం చించోలి(బి)లో నిర్మించిన మైనార్టీ బాలుర గురుకులాన్ని ప్రారంభిస్తారు.
- తెలంగాణ డెయిరీకి సంబంధించిన మినరల్ మిక్చర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తారు.
- గిరిజన సంక్షేమశాఖ ద్వారా మూడు నియోజకవర్గాల్లో నిర్మించిన బీటీరోడ్లు, వంతెనలను ప్రారంభిస్తారు.
- గిరిజన సంక్షేమశాఖ జిల్లాకేంద్రంలో నిర్మించిన బంజారాభవన్‌ను ప్రారంభిస్తారు.

క్రషర్‌గ్రౌండ్‌లో బహిరంగసభ..

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల అనంతరం కొత్త కలెక్టరేట్ రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొంటారు. దాదాపు లక్షమంది హాజరయ్యేలా ఈ సభాప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్ సభ ఏర్పాట్లు, జనసమీకరణను పర్యవేక్షించారు. ఎన్నికలకు ముందు జరగనున్న సీఎం సభ కావడంతో భారీగా జనసమీకరణకు జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు నాయకులూ ప్రయత్నాలు చేస్తున్నారు. నిర్మల్‌తోపాటు ముధోల్, ఖానాపూర్ నుంచి భారీగా జనాన్ని తరలించేలా చర్యలు చేపట్టారు.

పటిష్ట బందోబస్తు..

ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు బలగాలను మోహరించారు. సీఎం ప్రారంభించే కలెక్టరేట్, బీఆర్ఎస్ భవ న్, ఇతర కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముందస్తుగా సూచించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. ఇతర నేతలు, మీడియా ప్రతినిధులకు పర్మిషన్ లేదు. బ హిరంగసభకు మాత్రమే అందరికీ అనుమతి ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈమేరకు బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షించారు.

గులాబీమయం..



చాలారోజుల తర్వాత జిల్లా కేంద్రంలో ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. ఎటుచూసినా గులాబీ జెండాలు, సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికే ఫ్లెక్సీలతో నింపేశారు. సీఎం పర్యటన సాగే ప్రాంతమంతా గులాబీమయమైంది. కొత్త కలెక్టరేట్‌నూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల లైటింగ్, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అధికారుల చాంబర్లనూ ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కలెక్టరేట్‌తోపాటు, మిగితా పనులకు సంబంధించిన శిలాఫలాకాలనూ అక్కడే ఏర్పాటు చేశారు. సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీళ్లు, బటర్‌మిల్క్ అందించనున్నారు.

సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

నిర్మల్ టౌన్: ఎల్లపల్లి శివారులో సీఎం కేసీఆర్ నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సభా వేదిక, పార్కింగ్ ఏరియా, హెలీప్యాడ్‌ను సందర్శించారు. రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించారు. మంత్రి వెంట ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి గంగాధర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకులు అల్లోల దివ్య – గౌతమ్‌రెడ్డి, పాకాల రాంచందర్, దేవేందర్‌యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ చిలుక రమణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి, మంత్రి కుటుంబ సభ్యులు ఉన్నారు.

సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన్ రోడ్‌లో రూ.1.93 కోట్లతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. సెంట్రల్ లైటింగ్‌తో కలెక్టరేట్ రోడ్డుకు కళ వచ్చిందన్నారు.

'ఇంజినీరింగ్' ఇవ్వండి సారూ..

- మెడికల్ కాలేజీ ఇచ్చి ఖుషీ చేసింద్రు
- పీజీతోపాటు డైట్ కాలేజీ కావాలె
- జిల్లా మీదుగా రైళ్లు రావాలె..
- ఖానాపూర్ రెవెన్యూ డివిజన్ కావాలె
- పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలె..
- సీఎం కేసీఆర్‌కు జిల్లావాసుల వినతి



నిర్మల్: "ముఖ్యమంత్రి గారు.. నమస్కారం. నాలుగేళ్ల తర్వాత జిల్లాకు వస్తున్న మీకు స్వాగతం.. సుస్వాగతం.

సార్.. మీరు ఇచ్చిన హామీ ప్రకారం, మా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రయత్నం మేరకు నిర్మల్‌కు మెడికల్ కాలేజీ ఇచ్చి మమ్మల్ని చాలా ఖుషీ చేసింద్రు. మా పిల్లలకు డాక్టర్ చదువును అందుబాటులోకి తెచ్చి భవిష్యత్తుపై భరోసా ఇచ్చింద్రు. మాకు మెరుగైన వైద్యాన్ని అందేలా చేసింద్రు. ఇందుకు కృతజ్ఞతలు. అలాగే.. మీరన్నట్లు నిర్మల్‌ను ఎడ్యుకేషన్ హబ్ చేయాల్సిన అవసరముంది. జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ కూడా ఇవ్వండి సారు.

'ఇంజినీరింగ్' అవసరం..

ఇంటర్ కాగానే జిల్లాకు చెందిన చాలామంది పిల్లలు ఇంజినీరింగ్ చేస్తామంటున్నరు. వారంతా ఎక్కడో హైదరాబాద్, విజయవాడ తదితర దూరప్రాంతాలకు పోతుంద్రు. అన్నీ దగ్గరగా ఉండి, అసలు చదువే దూరంగా ఉండటం తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. ప్రయాణఖర్చులే ఏడాదికి వేలల్లో ఉంటున్నాయి. ఇప్పటికే జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌తోపాటు జగిత్యాల, సిరిసిల్ల, మంథని, సుల్తాన్‌పూర్, వనపర్తిలో ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నయ్. కొత్తగా ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్‌లోనూ జేఎన్‌టీయూ కాలేజీలు పెట్టేందుకు మీరు సుముఖత వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఆ జిల్లాలతోపాటే మా నిర్మల్ జిల్లాకు కూడా జేఎన్‌టీయూ కళాశాలను మంజూరు చేయండి. డిగ్రీలో ఉపాధినిచ్చే ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టండి. పీజీ కాలేజీని మళ్లీ ప్రారంభించి, ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సులు ప్రవేశపెట్టండి. ప్రభుత్వ డైట్ కాలేజీ కూడా జిల్లాకు అవసరమే. మీరు ఎన్నికల సభ హామీల్లో పేర్కొన్నట్లు వీలైతే యూనివర్సిటీ ఏర్పాటుతోపాటు నిర్మల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా చేస్తే మా బిడ్డల భవిష్యత్తుకు చాలా దోహదపడుతుంది.

రైలు తెస్తమంటిరి..

నిర్మల్ జిల్లావాసుల తీరని కలగా రైల్వేలైన్ మిగిలింది. ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు కేవలం 200 కి.మీ. లోపు లైన్‌వేస్తే సరిపోతుంది. ఇందుకోసం ఆరేళ్లక్రితం మా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, మాజీ ఎంపీ నగేశ్ కలిసి మీరు ఇచ్చిన లేఖతో కేంద్రాన్ని ఒప్పించారు. జాయింట్‌వెంచర్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకున్న ఈ లైన్ నిర్మాణంపై మీరు దృష్టిపెట్టండి. రాష్ట్ర భాగస్వామ్యం ఇవ్వడంతోపాటు కేంద్రంపైనా ఒత్తిడి తీసుకురావాలి. నిర్మల్‌తోపాటు నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి ఈ మార్గం ఉపయోగపడుతుంది.

టూరిజం సర్క్యూట్ చేస్తమంటిరి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దక్షిణ కశ్మీరంతో పోలుస్తూ నిర్మల్ కేంద్రంగా టూరిజం సర్క్యూట్ చేస్తామని హామీ ఇచ్చింద్రు. ఈ దిశగా ఇప్పటికీ ముందడుగు పడలేదు. ప్రకృతితోపాటు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలు జిల్లాలో ఉన్నాయి. వాటన్నింటినీ అభివృద్ధి చేస్తూ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి. బాసర నుంచి గోదావరి నది ద్వారా పోచంపాడ్ వరకు బోటింగ్ హామీ కూడా అలాగే ఉంది. నిర్మల్ పట్టణంలోనూ కోటలు, బురుజులు, గొలుసుకట్టు చెరువులు టూరిజం అభివృద్ధికి చాలా అనువుగా ఉన్నాయి. ఈసారైనా మీరన్న టూరిజం సర్క్యూట్‌ను చేయాలని కోరుతున్నాం.

హామీలన్నీ నెరవేర్చాలె..

గత ఎన్నికలకు ముందు మీరు నిర్మల్, ఖానాపూర్, భైంసా సభలలో ఇచ్చిన హామీల్లో ఇంకా కొన్ని అలాగే మిగిలి ఉన్నాయి. ఈసారైనా వాటిని నెరవేర్చాల్సిన అవసరం ఉంది. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయాలి. సదర్మట్ బ్యారేజీ నిర్మాణం త్వరగా పూర్తిచేయించి, ఖానాపూర్ ప్రాంత ఆయకట్టుకు ప్రత్యేక కాలువ నిర్మాణం చేపట్టాలి. లక్ష ఎకరాలకు నీళ్లివ్వాల్సిన కాళేశ్వరం ప్యాకేజీ కాలువల పెండింగ్ పనులు పూర్తిచేయించాలి. బాసర సరస్వతి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేయాలి. గల్ఫ్‌దేశాలకు వెళ్లకుండా ఇక్కడే యువత ఉపాధి పొందేలా జిల్లాకు ఇస్తామన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమల పని పూర్తిచేయాలి. గజ్వేల్‌తోపాటు నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఆ హామీని కూడా నెరవేర్చాలి. విద్య, వైద్యం, వ్యవసాయ, పర్యాటకరంగాల్లో నిర్మల్ అన్నివిధాల బాగుండేలా మీ పూర్తి సహకారం ఉండాలని కోరుకుంటున్నాం. ఈ దిశగా జిల్లాపై కరుణ చూపుతారని ఆశిస్తున్నాం"

ఇట్లు..
మీ నిర్మల్ జిల్లా ప్రజలు



క్రషర్ గ్రౌండ్‌లో ముస్తాబవుతున్న సభా వేదిక



సమీకృత భవనంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ..



బందోబస్తు కోసం కొత్త కలెక్టరేట్‌కు వచ్చిన పోలీసులు

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

- డీఈవో రవీందర్‌రెడ్డి

కుంటాల: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఓలా ఉర్దూ మీడియం పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలన్నారు. ఇంటింటా విద్యార్థులను చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యనందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు నాణ్యమైన భోజనం, ఈసారి ప్రయోగాత్మకంగా పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. గ్రామంలో ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు.

అందరి కృషితో ఉత్తమ ఫలితాలు..

అందరి కృషితోనే పదో తరగతిలో రాష్ట్రంలో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని డీఈవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. సమష్టి కృషితో మంచి ఫలితాలు సాధించిన ఎస్‌ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, సెక్టోరియల్ అధికారి లింబాద్రి, హెచ్‌ఎంలు సునీల్‌రెడ్డి, రాజేశ్‌కుమార్, శ్రీనివాస్‌ప్రసాద్, శ్రావణ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్లు సోఫీ, రాందాస్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు 395 అడ్మిషన్లు..

నిర్మల్ రూరల్: జిల్లాలో శనివారం బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఉపాధ్యాయులు ఉదయం నుంచి గ్రామాల్లో తిరిగి విద్యార్థులను చేర్చుకున్నారు. జిల్లాలో ఒక్కరోజే 395 కొత్త అడ్మిషన్లు అయినట్లు డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. ఒకటవ తరగతిలో 194 అడ్మిషన్లు, రెండు నుంచి 10వ తరగతి వరకు 201 కొత్త అడ్మిషన్లు అయ్యాయని పేర్కొన్నారు. ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 207 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు బదులు ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.



బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

పాఠ్య పుస్తకాలు తీసుకెళ్లండి

నిర్మల్ రూరల్: విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు చేరవేశామని వీటిని ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు తీసుకెళ్లాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రం నుంచి 8 మండల కేంద్రాలకు పుస్తకాలు సరఫరా చేశామని పేర్కొన్నారు. మిగతా మండలాలకు రెండు మూడు రోజుల్లో పంపిస్తామన్నారు. 90% పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం రోజు యూనిఫామ్, పుస్తకాలు విద్యార్థులకు అందించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

కోర్టు స్థలం పరిశీలించిన జిల్లా జడ్జి



కోర్టు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్జి

ఖానాపూర్: పట్టణంలో నూతనంగా కోర్టు నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని జిల్లా జడ్జి కర్ణకుమార్ శనివారం పరిశీలించారు. అంతకుముందు ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్, తహసీల్దార్ రాజమోహన్, స్థానిక న్యాయవాదులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కర్ణకుమార్ పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలోని 110 ఎకరాల ప్రభుత్వ భూమిలో కేటాయించనున్న 5 ఎకరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్, న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, వీవీ.రమణరావు, ఎం.సురేశ్, ఎం.వేణు, సత్యనారాయణ, కిశోర్, రాజశేఖర్, ఆసిఫ్, వెంకటేశ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆగమైన రైతుకు కేసీఆర్ భరోసా

నిర్మల్ టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆగమైన రైతులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన రైతు దినోత్సవంలో మాట్లాడారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతు విజయానికి ప్రతీకగా రైతు దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

రైతే రాజు.. రైతువేదిక ఓ దేవాలయం

- అన్నదాతకు అన్నివిధాలా ప్రభుత్వ సాయం
- వచ్చే నెలలో ఆయిల్‌పాం పరిశ్రమ ప్రారంభం
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ఎడ్ల బండి పై రైతు వేదికకు వస్తున్న మంత్రి, ఎమ్మెల్సీ

నిర్మల్ రూరల్: తెలంగాణలో రైతే రాజని.. అన్నదాలత కోసం నిర్మించిన రైతు వేదిక ఓ దేవాలయమని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని న్యూ పోచంపాడు గ్రామంలోని రైతు వేదికలో శనివారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు మంత్రి ఐకేరెడ్డి తన ఇంటి నుంచి రైతులతో కలిసి ఎడ్ల బండ్లతో ర్యాలీగా రైతు వేదికకు వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రధానిగా అవకాశం ఇస్తే దేశవ్యాప్తంగా రైతుబంధు, రైతుబీమా అమలు చేస్తారని తెలిపారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం సాగు చేయాలని సూచించారు. సోన్ మండలంలోని పాక్‌పట్లలో ఆయిల్‌పాం పరిశ్రమకు జూలైలో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ వస్తున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జెడ్పీ సీఈవో సుధీర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, ముతాపూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు బోండ్ల గంగాధర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పండుగలా ఎవుసం

కుంటాల: తెలంగాణ రాష్ట్రంలో ఎవుసం పండుగలా మారిందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కల్లూరు రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో మాట్లాడారు. రైతులకు సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జారాంయాదవ్, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, ప్రత్యేక అధికారులు రవీందర్‌రెడ్డి, సుదర్శన్, ఇసాక్, రైతుబంధు సమితి కన్వీనర్ శంకర్‌గౌడ్, జిల్లా కోకన్వీనర్ మగ్గిడి దిగంబర్, బీఆర్ఎస్ కన్వీనర్ దత్తాద్రి, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, వైస్ ఎంపీపీ మౌనిక సర్పంచులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

మామడ/ఖానాపూర్/పెంబి: రైతులు సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని, పంటల మార్పిడితో సాగులో మంచి ఫలితాలు సాధించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మామడ, ఖానాపూర్, పెంబి మండలాల్లో నిర్వహించిన రైతు దినోత్సవాల్లో పాల్గొన్నారు. మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా 700 చెరువులను రూ.400 కోట్లతో బలోపేతం చేయడం ద్వారా ఆయకట్టును స్థిరీకరించిందన్నారు. రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పాం సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లిలో మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతోపాటు లోఓల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జులై మొదటి వారంలో రూ.3 వేల కోట్లతో నిర్మించే ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అంతకుముందు మండలంలోని రాంరెడ్డిపల్లి నుంచి సత్తనపల్లి గ్రామంలోని రైతువేదిక వరకు ఎడ్లబండ్లతో ఊరేగింపుగా వచ్చారు. పెంబి మండల కేంద్రంలో రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు దినోత్సవంలో మాట్లాడుతూ రైతులు లేకుంటే ప్రపంచమే లేదన్నారు. రైతు పండిస్తేనే మూడు పూటలా అన్నం తింటున్నామని పేర్కొన్నారు. అంతకుముందు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీగా రైతు వేదికకు చేరుకున్నారు. కార్యక్రమాల్లో డీఆర్డీవో విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎంపీపీ మోహిద్, ఎంపీటీసీలు, సర్పంచులు, తహసీల్దార్లు, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



రాంరెడ్డిపల్లెలో ఎడ్లబండిపై కలెక్టర్

స్వరాష్ట్రంలో రైతుల అభివృద్ధి

- అదనపు కలెక్టర్ రాంబాబు

భైంసారూరల్/లోకేశ్వరం: స్వరాష్ట్రంలో వ్యవసాయం విస్తరిస్తోందని, రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. భైంసా మండలం వానల్‌పాడ్, దేగాం గ్రామాల్లో, లోకేశ్వరం మండల కేంద్రంతోపాటు రాజూర, పుస్పూర్, జోహర్‌పూర్, గడ్‌చాంద గ్రామాల్లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవం నిర్వహించారు. ఎడ్లబండ్ల ర్యాలీ, ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు పంటలపై అవగాహన కల్పించేందుకే రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వె ల్లడించారు. రైతులు వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలను వేసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతుబంధు, రైతుబీమాతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. లోకేశ్వరంలో ఎరువులు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రైతు సుధాకర్ అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చాడు. స్పందించిన రాంబాబు అధిక ధరలకు విక్రయించేవారిపై చర్య తీసుకుంటామన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ కల్పనజాదవ్, తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, సరిత, ఎంపీడీవో సోలమన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, సీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్..

క్లుప్తంగా

డల్లాస్‌లో దశాబ్ది ఉత్సవాలు


ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నాయకులు

కుంటాల: అమెరికాలోని డల్లాస్ నగరంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీఎం కేసీఆర్, అమరవీరుల త్యాగాల వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జీ.వీ రమణారావు, సురభి శ్రీనివాస్, దేవేందర్‌రావు, తక్కలపెల్లి దయాకర్‌రావు, మనోజ్ ఉన్నారు.

మట్కా స్థావరంపై దాడి


పట్టుబడిన మట్కా నిర్వాహకుడు

ఎదులాపురం: పట్టణానికి చెందిన చౌహన్ అనిల్ అనే వ్యక్తి స్థానిక ఖుర్షీద్ నగర్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో మట్కా స్థావరంపై శనివారం సాయంత్రం దాడి చేశారు. మట్కా చిట్టీలు, రూ.4800 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి


దీపక్ సహారే(ఫైల్)

బేల: మండలంలోని జూనోని గ్రామానికి చెందిన దీపక్ సహారే (35) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని జూనోని గ్రామ శివారులోని రైతు లెన్‌గురే సతీష్ పొలంలో కొన్ని రోజులుగా వ్యవసాయ బావి నిర్మాణ సీసీ రింగుల పనులు కొనసాగుతున్నాయి. శనివారం దీపక్ పనికి వెళ్లాడు. పైభాగంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారీ బావిలో పడిపోయాడు. తోటి కూలీలు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతిచెందాడు. భార్య ఛాయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


గంగాధర్ మృతదేహం

సోన్: యువకుడు అల్పాహారం తినొద్దామని వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిన విషాద ఘటన మండలంలోని సిద్దులకుంట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిర్నాంచి గంగాధర్ (34) బుల్లెట్ బండిపై జాఫ్రపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద టిఫిన్ చేద్దామని వెళ్లాడు. వంతెన దగ్గర ఎదురుగా వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాధర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో నిర్మల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

అదో ఏళ్లనాటి గిరిజన పల్లె... అడవితల్లి ఒడిలో ఒంటరిగా మిగిలిన ఆ ఊరికి వెళ్లాలంటే మట్టిరోడ్డే దిక్కు. మండల కేంద్రం నుంచి మూడు వాగులు దాటి గంటపాటు ప్రయాణం చేస్తే ఆ పల్లెకు చేరుకోవచ్చు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి వెళ్లడం కష్టతరమే. అలాంటి సమయాల్లో ఎందరో ఆదివాసీ అభాగ్యులు ప్రాణాలు వదిలారు. అయినా పట్టించుకునే దయార్ధ హృదయులు లేరు. నింగికి రాకెట్‌ను పంపించే అత్యాధునిక యుగంలో ఆ ఊరికి కనీసం ఫోన్ సిగ్నల్ కూడా రాని పరిస్థితి. చుట్టూ ఇబ్బందులున్నా.. ఎవరినీ నిందించకుండా వన్యప్రాణులతో స్నేహం చేస్తూ.. అడవితల్లి ఒడిలో అలరాలుతున్న 'ఇస్లాంపూర్'పై ప్రత్యేక కథనం. - జన్నారం




వాగులో చిక్కుకున్న బైక్‌ను బయటకు తీస్తున్న యువకులు(ఫైల్)

అనగనగా ఓ ఊరు..

- మౌలిక వసతులకు నోచుకోని తీరు..
- అభివృద్ధికి ఆమడ దూరంలో ఇస్లాంపూర్
- జనావాసాలకు 15 కిలోమీటర్ల దూరంలో గ్రామం
- రోడ్డు లేక రాకపోకలకు ఆదివాసీల ఇబ్బంది
- ప్రాణాలు పోతున్నా పట్టింపులేని అధికారులు


వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని తాడు సాయంతో పైకి లాగుతున్న దృశ్యం (ఫైల్)

ఇస్లాం స్థాపించిన గ్రామం
నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలంలోని ఇస్లాంపూర్ శతాబ్దాల క్రితం వెలసిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. రజాకార్ల పాలనలో ఇస్లాం అనే వ్యక్తి ఆ గ్రామానికి వచ్చి అడవిలో తలదాచుకుని గిరిజనులతో మమేకం కావడంతో ఆ గ్రామానికి ఇస్లాంపూర్ అని పేరు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అడవిని నరికి సాగు చేసుకుని ఆదివాసీలు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో ఆదివాసీలు అడవి సంపద అయిన పుట్టతేనె, ఫలాలపై ఆధారపడి జీవించారు.

126 ఇండ్లు.. వెయ్యికి పైగా జనాభా
గ్రామంలో 60 గోండు కుటుంబాలు, 45 కొలాం కుటుంబాలు, 15 నాయకపోడ్ కుటుంబాలు, 6 నేతకాని కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. ఉడుంపూర్ గ్రామ పంచాయతీలోని ఈ గిరిజన గూడేన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది.

ఎటువెళ్లినా పది కిలోమీటర్లు..
దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎడ్లబండ్ల బాటలో రాకపోకలు సాగిస్తున్నారు. మంచిర్యాల నియోజకవర్గంలోని జన్నారం మండలం కవ్వాల్‌కు రావాలంటే 15 కిలో మీటర్లు, కడెం మండలం ఉడుంపూర్‌కు రావాలంటే 9 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సిందే. రేషన్ సరుకుల కోసం ఉడుంపూర్, అవసరాల నిమిత్తం అత్యధికంగా గిరిజనులు జన్నారం మండల కేంద్రానికి రావాల్సిందే.

రోడ్డు లేక నరకయాతన..
వందల ఏళ్ల క్రితం ఏర్పడిన ఆ గ్రామానికి నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. దట్టమైన అడవులు ఉండడంతో అటవీశాఖ రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడం లేదు. ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు వేయాల్సిందే. మూడు వాగులు దాటితే తప్ప జనావాసాల్లోకి రాలేని పరిస్థితి. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగితే మూడు నెలలపాటు రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో వర్షాకాలంలో అనారోగ్యం బారిన పడినవారు వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. బైక్‌పై బలవంతంగా తీసుకెళ్లినా వాగులు దాటే లోగా ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు
గ్రామంలో 36 మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్నారు. లక్సెట్టిపేట నుంచి ప్రతిరోజు ఉపాధ్యాయుడు వచ్చి పాఠాలు బోధిస్తాడు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు స్తంభించడంతో మూడునెలల పాటు ఉపాధ్యాయుడు రాలేని పరిస్థితి. దీంతో గ్రామంలో ఎవరైనా చదువుకున్న వారితో లేదా వీవీని పెట్టుకుని పిల్లలకు చదువు చెప్పిస్తున్నారు. గ్రామానికి నూతన పాఠశాల భవనం ఆరేళ్ల క్రితం మంజూరైనా నేటికీ నిర్మాణం పూర్తికాలేదు. శిథిలావస్థలోని పాఠశాల భవనాన్నే గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్‌గా వినియోగిస్తున్నారు.


అసంపూర్తిగా పాఠశాల భవనం

పట్టింపులేని పాలకులు, అధికారులు
గ్రామం ఏర్పడి వందల ఏళ్లు కావస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం మాత్రమే వస్తారని, ఆతర్వాత మర్చిపోతారని చెప్తున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్, ఖానాపూర్ ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించినా ఎలాంటి అభివృద్ధి చేయలేదని, మా సమస్యలపై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఇస్లాంపూర్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, చెరువులు నిర్మించడంతో పాటు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.


ఇస్లాంపూర్‌కు అడవి నుంచి వెళ్లే దారి ఇదే

అభివృద్ధికి అటవీశాఖ అడ్డు...
ఎమ్మెల్యే రేఖానాయక్ చొరవతో ఉడుంపూర్ నుంచి ఇస్లాంపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు, చెరువుల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో ఆ నిధులు మళ్లిపోయాయి. మిషన్ భగీరథకు అనుమతి లేకపోవడంతో నల్లానీటిని ఆ గ్రామం నోచుకోలేదు. గ్రామ పంచాయతీలో నీటి ట్యాంకు నిర్మాణం ప్రారంభించారు. సామగ్రి తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామంలో ఉన్న మూడు చేతిపంపుల నీటిని తాగడానికి, ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు. అవి చెడిపోతే తాగునీటికి తంటాలు పడాల్సిందే.

ఎందరికో పురుడు పోసిన



గర్భిణులను ఆస్పత్రులకు తరలించే అవకాశం లేకపోవడంతో చాలామంది గిరిజన మహిళలకు నేనే పురుడు పోసిన. కొన్ని సందర్భాల్లో కొంతమంది చనిపోయారు. ఎప్పటి నుంచో ఉంటున్న మా ఊరికి సౌకర్యాలు లేవు. ఇక్కడే పుట్టిన వాళ్లం ఇక్కడే చస్తాం కానీ బయటకు వెళ్లలేం.
– జంగుబాయి, గ్రామస్తురాలు

రోడ్డు సౌకర్యం కల్పించాలి



నేను పుట్టినప్పటి నుంచి చూస్తున్న. మా ఊరు ఇలాగే ఉంది. ఇక్కడి నుంచి వేరే ఊరికి పోవడానికి మాకు రోడ్డు లేదు. వాగులు వంకలు దాటుకుంటూ అడవిలో నుంచి వెళ్లాలి. వానాకాలం రాకపోకలు ఉండవు. మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.
– కనక రాము, ఇస్లాంపూర్

చెరువు నిర్మించాలి



గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లాం. కానీ ఎలాంటి ఫలితం లేదు. గ్రామంలో చెరువు నిర్మాణం చేపడితే రైతులు పంటలు పండించుకుంటారు. దీనిపై అధికారులు, పాలకులు పట్టించుకోవాలె.
– కనక విజయ్‌కుమార్, ఎంపీటీసీ

సమస్యలు తీర్చలేకపోతున్న



మా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇప్పటి వరకు కేవలం సీసీ రోడ్డు పనులతో పాటు వైకుంఠ దామం, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డులను మాత్రమే నిర్మించాం. గ్రామానికి రోడ్డు లేక సామగ్రి తేలేకపోతున్నాం. వాహనాలు ఇక్కడికి రావు. దీంతో అభివృద్ధి జరుగడం లేదు.
– కనక జైతు, సర్పంచ్

అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వడం లేదు



ఇస్లాంపూర్ అభివృద్ధికోసం ముఖ్యమంత్రితో మాట్లాడి రోడ్డు, చెరువు నిర్మాణం కోసం నిధులు తెప్పించా. కానీ అటవీశాఖ క్లియరెన్స్ ఇవ్వలేదు. నా సొంత నిధులతో సీసీరోడ్డు నిర్మించా. నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టాం. నేడు జిల్లాకు రానున్న సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తా.
– అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే

సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ


మాట్లాడుతున్న రామయ్య

ఖానాపూర్: జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీఎం కేసీఆర్‌కు సీపీఐఎంఎల్ ప్రజాపంథా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కమిటీ కార్యదర్శి నందిరామయ్య బహిరంగ లేఖ రాశారు. 2014, 2018 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల మెనిఫెస్టో, బహిరంగ సభల ద్వారా, పార్టీ ప్రతినిధుల ద్వారా ఎన్నో హామీలు ఇచ్చినప్పటికీ నేటికీ అనేక హామీలు నెరవేరలేదని లేఖలో పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి నిర్మల్ సభలో ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారం సదర్మాట్ ప్రత్యేక కాలువను 7కిలో మీటర్ల మేర నిర్మిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఖానాపూర్‌లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎందుకు చేయలేదన్నారు. పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. పట్టణంలోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 400 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిఏళ్లు గడుస్తున్న ఎందుకు పంపిణీ చేయడం లేదని మండిపడ్డారు. దళితులకు మూడెకరాల భూమి వంటి హామీలపై సమాధానం చెప్పాలన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

ఆదిలాబాద్: హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు పాటుపడాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమ్మరికుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన 21అడుగుల హనుమాన్ విగ్రహ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ విగ్రహ ఆవిష్కరణను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వాచనాలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూ ఇతర మతాలను గౌరవించాలన్నారు. హిందూ ధర్మం కూడా అదే నిర్దేశిస్తుందన్నారు. భారీ విగ్రహం ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. వేద పండితులు వారిచే పూజలు చేయించి ఆశీర్వాచనలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు మిష్టు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ నాయకులు లాలామున్న, లోక ప్రవీణ్‌రెడ్డి, ఆదినాథ్, ముకుంద్, ధోని జ్యోతి, చిల్కూరి జ్యోతిరెడ్డి ఉన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

అకాల వర్షం


ఇంటిపైకప్పు వద్ద బాధితుడు నగేశ్

ఖానాపూర్: మండలంలో శనివారం అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం స్వల్పంగా తడిసింది. ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు కేంద్రాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పారు. అయినప్పటికీ పలువురి ధాన్యం తడిసిపోయింది. తర్లపాడ్ గ్రామానికి చెందిన అంగిరేకుల నగేష్ ఇంటిపైకప్పు లేచిపోయి గోడలు కూలిపోయాయి. రూ.40వేలకు పైగా నష్టం వాటిల్లింది.

భారీ ఈదురుగాలులతో..
పెంబి: మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి రోడ్డుపై భారీ వృక్షాలు పడటంతో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. పెంబి వేణునగర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో భారీ చెట్లు పెంబి సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33కేవీ విద్యుత్ తీగలపై పడటంతో ఐదు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో మండల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు చేస్తున్నామని ఏఈ సాయికిరణ్ తెలిపారు.


రోడ్డుపై విరిగిపడిన చెట్టు

స్పందిస్తున్న మానవతావాదులు

సాక్షి స్పందన

బోథ్: 'ఇంటికి పెద్దదిక్కు..ఆ చిన్నారి' అనే శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన వివేకానంద యూత్ సభ్యులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందజేశారు. రిమ్స్‌తో పాటు, నిర్మల్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సిబ్బంది సోమవారం తండ్రి మలారిసింగ్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. కాగా ఫోన్‌పే ద్వారా కొంతమంది నగదును పంపించారు. కాగా మరికొంత మంది మానవతావాదులు స్పందించి వారి కుటుంబానికి అండగా నిలువాలని స్థానికులు కోరుతున్నారు.


సరుకులు అందిస్తున్న యూత్ సభ్యులు

సిమెంట్ లారీలు బోల్తా

- వేర్వేరు చోట్ల ఘటనలు
- తృటిలో తప్పిన ప్రమాదాలు

జైనథ్: మండలంలోని తరోడ సమీపంలో జాతీయ రహదారిపై ఇటీవల కుంగిన వంతెన కింద తాత్కాలిక వంతెనపై భారీ సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. శనివారం ఉదయం మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు సిమెంట్ లోడ్‌తో వస్తున్న లారీ ఇరుకుగా ఉన్న మట్టి రోడ్డు గుండా ప్రయాణించే సమయంలో అదుపు తప్పింది. లారీ వెనక భాగం నీళ్లలో పడిపోయింది. వెనక నుంచి భారీ వాహనాలు రాకపోవడం, డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ తాత్కాలిక వంతెన గుండా లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలకు అనుమతి లేకపోగా కొన్ని నెలలుగా అధికారులు అనుమతించడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు.

జైనథ్‌లో మరో లారీ..
మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారిపై సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఉదయం మహారాష్ట్ర నుంచి సిమెంట్ లోడ్‌తో ఆదిలాబాద్‌కు వస్తున్న లారీ అదుపు తప్పి కుడి వైపు మైలురాయిని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా లారీ బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ రోడ్డులో నిత్యం భారీగా సిమెంట్ లోడ్‌తో లారీలు తిరుగుతుండటంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.


తాత్కాలిక వంతెన వద్ద పడిపోయిన సిమెంట్ లారీ

పిడుగుపాటుతో ఎడ్లు మృతి

ఇంద్రవెల్లి: పిడుగుపాటుకు గురై ఎడ్లు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని హీరాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మారుతిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. రైతు పెందోర్ రాము, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మారుతిగూడ గ్రామానికి చెందిన పెందోర్ రాము ప్రతి రోజులాగానే శనివారం ఎడ్ల జతను మేతకు వదిలేశాడు. మధ్యాహ్నం వర్షం రావడంతో పిడుగుపాటుకు గురై ఎడ్లు మృతి చెందాయి. దీంతో రైతు పెందోర్ రాము ఆందోళన చెందుతున్నాడు. వాటి విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.


మృతిచెందిన ఎడ్లు

అటవీశాఖ అధికారులపై ఆగ్రహం

- కల్వర్టు పనులు అడ్డుకున్న అటవీశాఖ అధికారులు..
- అడ్డుకున్న గ్రామస్తులు
- వెనుదిరిగిన అటవీశాఖ అధికారులు

సిరికొండ: మండలంలోని పోచంపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న నూతన కల్వర్టు పనులకు అటవీశాఖ నుంచి అనుమతులు లేవని ఇంద్రవెల్లి రేంజ్ అటవీ అధికారులు శనివారం పనులను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున కల్వర్టు పనులు జరుగుతున్న ప్రదేశానికి వచ్చి అటవీ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఎప్పటి నుంచో రాకపోకాలు సాగిస్తున్నామని, మీరు ఎలా పనులను అడ్డుకుంటారని ఆగ్రహంతో అధికారులను నిలదీశారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.


అధికారులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామానికి చెందిన బ్యాగరి రవి ఇల్లు శుక్రవారం రాత్రి కరెంటు షాక్‌తో పాక్షికంగా దగ్ధమైంది. శనివారం ఆర్‌ఐ బాలకిషన్ కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. ఆయన వివరాల ప్రకారం... రవి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్నారు. ఇంట్లో నుంచి మంటలు రావడంతో గమనించిన రవి కుటుంబీకులు స్థానికుల సాయంతో మంటలు ఆర్పివేశారు. ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో రూ.3లక్షల 50వేల ఆస్తినష్టం వాటిల్లింది.


కాలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ బాలకిషన్